క్లుప్తంగా

గుంత పూడ్చివేతకు చర్యలు


నీటిని తరలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

సరుబుజ్జిలి: ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలో దిగబడిన కారు అన్న వార్తకు అధికారులు బుధవారం స్పందించారు. ఆర్‌అండ్‌బీ జేఈ ఎం.ఎం.నాయక్ ఆధ్వర్యంలో కాలువకు అడ్డంగా ఉన్న తాత్కాలిక నిర్మాణాన్ని తొలగించారు. నిల్వ చేరిన నీటిని బయటకు తరలించారు. తదుపరి గుంతను పూడ్చివేత పనులు ప్రారంభించారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ


విచారణ నిర్వహిస్తున్న ఉపాధి ఏపీడీ లోకేష్

ఆమదాలవలస: మండలంలోని తోటాడలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పైడి సత్యనారాయణపై అదే గ్రామానికి చెందిన తాండ్ర రంగారావుతోపాటు మరికొంత మంది ఇటీవల ఫిర్యాదు చేసారు. ఈ మేరకు ఉపాధి ఏపీడీ లోకేష్ బుధవారం తోటాడ సచివాలయంలో ఉపాధి హామీ వేతనదారుల సమక్షంలో విచారణ చేపట్టారు. గ్రామంలో లేనివారి పేరిట ఫీల్డ్ అసిస్టెంట్ మస్తర్లు వేసి నిధులు దుర్వినియోగం చేశారని విచారణ కమిటీ దృష్టికి పలువురు వేతనదారులు తీసుకువచ్చారు. వేతనాదారులు ఇచ్చిన వాగ్మూలాన్ని ఏపీడీ రికార్డు చేశారు. ఎటువంటి గొడవలు జరగకుండా ఎస్‌ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఏపీఓ సురవరపు లక్ష్మీనరసమ్మ, దూసి సీహెచ్‌సీ మాజీ చైర్మన్ హనుమంతు బాలకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

లఘు చిత్రంతో చైతన్యం..


షార్ట్ ఫిల్మ్ బృందం

నరసన్నపేట: యువతతోపాటు విద్యార్థులు మత్తు పానీయాలకు, పదార్థాలకు బానిసలై జీవితాన్ని చిత్తు చేసుకుంటున్నారనే నేపథ్యంలో షార్ట్ ఫిల్మ్ తీయడానికి బుధవారం స్థానిక షిర్డీ సాయి ఆలయంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు షార్ట్ ఫిలమ్‌కు కెమేరామన్‌గా వ్యవహరిస్తున్న గణేష్ బాషా తెలిపారు. కొత్త నటీనటులతో ఈ చిత్రాన్ని చిత్రీకరిస్తున్నామన్నారు. డైరెక్టర్‌గా గొల్లంగి శివ, ప్రొడ్యూసర్‌గా రాజాపు శ్రీను ఉంటున్నారన్నారు. నరసన్నపేట ప్రాంతంలోనే ఈ చిత్రాన్ని తీస్తామన్నారు.

టీడీపీ మద్దతుదారులకు.. ఓటు వేయకపోతే పథకాల రద్దు

కొత్తూరు: ఈ నెల 8 తేదీన నిర్వహించనున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులకు ఓట్లు వేయకపోతే ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తామని కూటమి నాయకులు బెదింపులకు పాల్పడినట్లు సమాచారం. మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ ఆర్ కాలనీతోపాటు పలు గ్రామాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడానికి బెదిరింపులకు దిగినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, మెట్టూరు బిట్-1కు చెందిన బట్టు నేతాజీ, తదితరులు ఆరోపించారు. కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడాని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టీడీపీ నాయకులు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పలుచోట్ల వివాదాలు తలెత్తే అవకాశం ఉన్నందున ఇప్పటికే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎంఈఓలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

జలుమూరు: మర్రివలస పంచాయతీ పరిధిలోని ఎస్టీ మాకివలసలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని జేసీ ఫర్మా అహ్మద్ బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ఎంత మంది చిన్నారులు ఉన్నారు, వారికి రోజువారి పౌష్టికాహారం ఎంత ఇస్తున్నారని ఆరా తీశారు. కేంద్రంలో ఉంచాల్సిన సరుకులు, గుడ్లు వేరేచోట ఎందుకు ఉంచుతున్నారని అడగ్గా.. కేంద్రానికి తలుపులు లేనందున ఇంటి వద్ద ఉంచాల్సి వస్తోందని కార్యకర్త బదులిచ్చారు. కేంద్రాన్ని పర్యవేక్షకులు ఎన్ని రోజులకు తనిఖీ చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రం సక్రమంగా నడిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షకులు కేంద్రాలను తనిఖీ చేసేలా చూడాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను ఆదేశించారు.

చాకిపల్లిలో పాఠశాల ఏర్పాటు చేయాలి

పాతపట్నం: మండలంలోని చాకిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కోరారు. పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట, పాతపట్నం మండలాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. ఐదు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

• నేత్ర పరీక్షలు



నరసన్నపేట మండలం ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 185 మంది విద్యార్థులకు బుధవారం కంటి పరీక్షలు నిర్వహించినట్లు పోలాకి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాలగంగాధరరాజు తెలిపారు. 18 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి, కళ్లద్దాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇంటర్ విద్యార్థులకు తనిఖీలు చేయాల్సి ఉందని, వీరికి కళ్లద్దాలకు ప్రొవిజన్ లేదన్నారు. హెచ్ఎం హర్ష, పీహెచ్‌సీ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

• ఆర్థికసాయం



సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999లో 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు వారితోపాటు చదువుకున్న అడపా కృష్ణయ్య కుటుంబానికి బుధవారం రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. సారవకోట గ్రామానికి చెందిన కృష్ణయ్య ఇటీవల మృతి అనారోగ్యంతో చెందారు. సారవకోట పోస్టాఫీసులో కృష్ణయ్య కుమారుడి పేరున రూ.50 వేలను ఫిక్సిడ్ డిపోజిట్ చేసి పాస్ పుస్తకాన్ని అందజేశారు. అక్యాన విజయ్‌కుమార్, గంగాల సింహాచలం, నాగరాజు, రామకృష్ణ ఉన్నారు.

– సారవకోట

స్థల పరిశీలన



హిరమండలం మండలంలోని సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శివాలయం నిర్మాణానికి సంబంధించి స్థలం కేటాయించాలని ఆ గ్రామానికి చెందిన చెగువేరా యూత్ యూనియన్ సభ్యులు టెక్కలి సబ్ కలెక్టర్‌కు ఇటీవల దరఖాస్తు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి డీఎల్‌పీఓ రమణ, స్థానిక తహసీల్దార్ వెంకటరమణ బుధవారం స్థల పరిశీలన చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎల్‌పీఓ అన్నారు. ఈఓపీఆర్డీ నాగమణి, మండల సర్వేయర్ శ్యామలరావు, జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

– హిరమండలం

ఉద్యాన పంటలకు ఊతం


సవరమాలువలో మొక్కలు నాటేందుకు కొండపై గోయ్యిలు తీస్తున్న రైతులు

- మూడేళ్లపాటు ఉపాధి హామీతో పంటల నిర్వహణ
- ఆసక్తి చూపుతున్న రైతులు

సారవకోట: ఉద్యాన వన పంటలకు ఊపాధి పథకం ఊతం ఇవ్వనుంది. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చిన్న, సన్నకారు రైతులతోపాటు కొండ ప్రాంతాలలో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులకు ఈ ఉద్యానవన పంటల అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఈ ఉద్యానవన పంటల సాగుకు రైతులు ఆసక్తి కనబర్చుతున్నారు. ఈ ఉద్యానవన పంటలలో భాగంగా రైతుకు 30 సెంట్లు కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ఉపాధి సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. కొబ్బరి, జామ, జీడి, మామిడి, మునగ తదితర పంటల పెంపకంపై రైతులు దృష్టి సారించేలా చేస్తున్నారు. ఉపాధి పథకం ద్వారా రైతుకు ఏకరా భూమిలో ఈ ఉద్యానవన పంటలు సాగు చేస్తే వేతనాల రూపంలో రూ.53,828, మెటీరియల్ రూపంలో రూ.43,238 అందించనున్నారు. మొక్కలకు గొయ్యి తీసేందుకు, మొక్క కొనుగోలు చేసేందుకు, వాటికి ఎరువులు, ఇతర నిర్వహణ పనుల నిమిత్తం ఈ నిధులు మంజూరు చేయనున్నారు. మూడేళ్లపాటు ఒక్కొక్క మొక్క నిర్వహణకు రూ.18.37 చొప్పున నిధులు మంజూరు చేస్తారు.


చోడసముద్రంలో ఉద్యానవన పంటల పథకం ద్వారా నాటిన మొక్కలు పరిశీలిస్తున్న ఉపాధి సిబ్బంది

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్న కారు, గిరిజన రైతులకు ఉద్యానవన పంటల సాగు ద్వారా మొక్కలు, ఎరువులు, వాటి నిర్వహణకు అవకాశం కల్పిస్తున్నాం. ఈ పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. గ్రామాల్లో దీనిపై తమ సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. మొక్కలను తాము ఎంపిక చేసిన నర్సిరీలలో కొనుక్కొవచ్చు, రైతుకు నచ్చిన చోట మొక్కలు కొనుగోలు చేయవచ్చు. మూడేళ్లపాటు మొక్కల నిర్వహణకు ఉపాధి హామీ ద్వారా నిధులు మంజూరు చేస్తాం.

– నారాయణరావు,
ఏపీఓ, సారవకోట మండలం

ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగు వివరాలు

మండలం	రైతులు	విస్తీర్ణం (ఎకరాలు)	మొక్కలు
ఆమదాలవలస	33	14.97	1041
బూర్జ	38	33	2271
హిరమండలం	40	27.5	1925
సరుబుజ్జిలి	21	15.3	1053
పాతపట్నం	116	94.7	6627
కొత్తూరు	113	81.15	5630
ఎల్.ఎన్.పేట	18	14.73	1009
మెళియాపుట్టి	142	103.7	7195
నరసన్నపేట	26	11.19	1579
జలుమూరు	12	5.7	464
పోలాకి	34	23.04	1439
సారవకోట	146	104.75	7329

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నరసన్నపేట: నరసన్నపేట పరిధిలోని పలు వీధుల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ శంకరరావు బుధవారం తెలిపారు. నిర్వహణ పనులు చేయనున్న నేపథ్యంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 2 గంటల వరకు గాంధీనగర్, కొత్తవీధి, నాయుడు వీధి, నేతాజీ వీధి, భవానీపురం, దేశవానిపేట, పురుషోత్తంనగర్ కాలనీ, లచ్చుమన్నపేట, ఆదివరపుపేట వీరన్నాయుడు కాలనీ, బొరిగివలస, ఈదులవలస కూడలి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పోలాకిలో..

పోలాకి: మండలంలోని ఈదులవలస 11 కేవీ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈఈ జి.శంకరరావు బుధవారం తెలిపారు. కిల్లాం అగ్రికల్చర్, ఈదులవలస, ఈదులవలస కోలనీ, ముప్పిడి, రాళ్ళపాడు, ధీర్ఘాశి, గొల్లవలస, తోటాడ, కింజరాపువానిపేట, ఎస్‌ఎల్‌పురం, కొండలక్కివలస తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

ఆమదాలవలస మండలంలో..

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని 33/11 ఫీడర్ పరిధిలో శుక్రవారం చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతులు నిర్వహించనున్నట్లు ఈఈ బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొడ్డేపల్లిపేట, వెంకయ్యపేట, లక్ష్మడుపేట, తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, ఏపీ టీడ్కో కాలనీ, చంద్ర హర్ష ఆక్వా, కేజీబీవీ ఉన్నత పాఠశాల, ఆర్‌ఆర్ గ్రానైట్, మండాది బ్రిక్ ఇండస్ట్రీ, అక్కులపేట, సంతకొత్తవలస, ధన్నానపేట, తాళ్లవలస తదితర ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం: మండలంలోని కొరసవాడ, రొంపివలస 11 కేవీ ఫీడర్‌ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 9వ తేదీన విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్లు విద్యుత్‌శాఖ టెక్కలి ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూరగాం, బోరుభద్ర, గురండి, బగదల, కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం, సీతారాంపల్లి, తిడ్డిమి, రంకిణి, దాసుపురం, సూర్యనారాయణపురం, దాసుపురం తదతర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: మండలంలోని వసప, నివగాం విద్యుత్ సబ్ స్టేషన్లలో శుక్రవారం మరమత్తులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణరావు బుదవారం తెలిపారు. వసప ఫీడర్ పరిధిలో ఉన్న సిరుసువాడ, కుంటిభద్ర కాలనీ, వసప, నివగాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

- జేసీ ఫర్మా అహ్మద్


మాకివలసలో పర్యటిస్తున్న జేసీ ఫర్మా అహ్మద్

జలుమూరు: మర్రివలస పంచాయతీలోని ఎస్టీ మాకివలసకు చెందిన గిరిజనుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను జేసీ ఫర్మా అహ్మద్ ఆదేశించారు. ఎస్టీ మాకివలస గ్రామాన్ని గురువారం సందర్శించారు. గ్రామంలో నెలకొన్న భూవివాదంపై గ్రామస్తులతో మాట్లాడారు. వాస్తవంగా భూములు ఎవరి పేరుపై ఉన్నాయి, ఎవరికి అమ్మకాలు జరిగాయని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. దీనికి గిరిజనులు స్పందిస్తూ మూడు తరాల నుంచి ఆ భూములను తాము సాగు చేసుకుంటున్నామని, వచ్చిన ఆదాయంలో కొంతమొత్తం రైతులకు చెల్లిస్తున్నామన్నారు. ఆ భూములను సంబంధిత రైతులు, గుప్తా అనే వ్యక్తి వేరొకరికి అమ్మకాలు చేశారన్నారు. దీనిపై అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. గ్రామంలోని మౌలిక వసతులు, ఎన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి, భూ వివాదంపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేయాలని రెవెన్యూ సిబ్బందికి జేసి ఆదేశించారు. ఆర్డీఓ రంగయ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు, ఆర్‌ఐ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


తాగునీటి బోరుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ రామారావు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామ హరిజన వాడలో బోరును సర్పంచ్ బోసిరామారావు బుధవారం మరమ్మతులు చేయించారు. బోరు పాడై తాగునీటికి ఇబ్బంది పడుతున్న ఈ విషయాన్ని తెలుసుకుని బాగుచేయించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఆ వీధి వాసులకు హర్షం వ్యక్తం చేశారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రు పాలు పట్టిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లోనిఅన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లి పాలు అమృతంతో సమానమన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


సారవకోట: కేళవలసలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


బూర్జ: లచ్చయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది


హిరమండలం: పాతహిరమండలంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్య సిబ్బంది


ఎల్.ఎన్.పేట: యంబరాంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతిలక్ష్మి


నరసన్నపేట: నడగాంలో అవగాహన కల్పిస్తున్న ఉర్లాం పీహెచ్‌సీ, ఐసీడీఎస్ సిబ్బంది

వారసత్వ సంపదను కాపాడుకోవాలి


పొందూరు: చేనేత కార్మికులకు సన్మానిస్తున్న కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్

పొందూరు: దేశంలో చేనేత, ఖాదీ రంగాలు వారసత్వ సంపదని వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఏఎఫ్‌కేకే సంఘాన్ని సందర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక భూమిక పోషించిన చేనేత, ఖాదీ వస్త్రాలను ప్రతిఒక్కరూ ఆదరించాలని సూచించారు. నేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేత, వడుకు కార్మికులను సన్మానించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంటుకు కామేశ్వర ప్రసాద్, దండా వెంకటరమణ పాల్గొన్నారు.

సాయిబాబా చేనేత సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ..

పొందూరుకు చెందిన సాయిబాబా చేనేత సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. చేనేతవాడ నుంచి సాయిబాబా చేనేత సొసైటీ వరకు ర్యాలీ చేపట్టారు. సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పూడి తిరుపతిరావు, జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు ధరిద్దాం..

నరసన్నపేట: మన్నికకు, ఆరోగ్యానికి చేనేత వస్త్రాలు ఎంతో మంచివని ప్రతిఒక్కరూ వీటిని ధరించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లత అన్నారు. కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అందరూ చేనేత వస్త్రాలు ధరించాలని ప్రిన్సిపాల్ ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్ కార్యాలయం తరలింపు


కార్యాయాలనికి విద్యుత్ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

పోలాకి: మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న హౌసింగ్ కార్యాలయం నుంచి ఇకపై సేవలు అందనున్నాయి. ఇప్పటివరకు నరసన్నపేట కార్యాలయం నుంచే పోలాకి హౌసింగ్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేవారు. ఇక్కడ కార్యాయలం నిర్మాణం చేపట్టి దాదాపు ఎనిమిదేళ్ల అయినా కార్యాలయం తాళంవేసి ఉండేది. తాజాగా నరసన్నపేట నుంచి ఫైళ్లను తరలించారు. ఇకపై పోలాకి లబ్ధిదారులకు ఇక్కడ నుండే సేవలు అందుతాయని డీఈ అప్పారావు బుధవారం తెలిపారు.

ఘనంగా తిరువీధి


ముర్రాటలతో ఆలయానికి వస్తున్న భక్తులు

జలుమూరు: పెద్దదూగాంలో నీలవేణి అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో భాగంగా బుధవారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అర్చకులు మావుడూరు జగదీష్‌బాబు సోదరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు ముర్రాటలు సమర్పించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరామర్శ..


హిరమండలం: త్రినాథరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు


సారవకోట: మల్లిపురం దాలయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

హిరమండలం: మండలంలోని పాతహిరమండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోవుదల త్రినాథరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏపీ సురేష్, లోలుగు లక్ష్మణరావు, వంగపల్లి చిన్నారావు, వి.బాలరాజు, నక్క ఆనందరావు ఉన్నారు.

– సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామానికి చెందిన దుంగ రామారావు, వాండ్రాయి గ్రామానికి చెందిన జె.చంద్రయ్య, సవరబెజ్జి గ్రామానికి చెందిన మల్లిపురం దాలయ్య ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య బుధవారం పరామర్శించారు. కొత్తూరు గ్రామానికి చెందిన సర్పంచ్ బాడాన కృష్ణారావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఏల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్‌లు కొండాల బాబూరావు, ఇప్పి షణ్ముఖరావు తదితరులు ఉన్నారు.